

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త

## 5 కోట్ల ప్రభుత్వ నిధులతో
## మర్రిపాడు మండల కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
### 16న శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి ఆనం



**నెల్లూరు, జులై 13, ప్రభాతవార్త -వైద్యం** మర్రిపాడు మండల కేంద్రంలో పేద మధ్య తరగతి ప్రజల కోసం ఉచిత నేత్ర చికిత్స క్యాంపుతో పాటు.. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్న మంత్రి ఆనం. జులై 16వ తేదీ బుధవారం ఉదయం 9.30గంటలకు స్థానిక జడ్పీ హైస్కూల్ హైస్కూల్ నందు శంకర్ నేత్రాలయం చెన్నై హాస్పిటల్ వారి సారథ్యంలో కేకే రాజా చౌదరి, ఈమెడ్ ఈవెంట్స్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ఉచిత నేత్ర చికిత్స.. మెడికల్ క్యాంపును లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం 50 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న పీహెచ్ సీ నూతన భవనాల నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తారు. ఉదయం 11.15 నిమిషాలకు మర్రిపాడు గ్రామంలో 40 లక్షలు నిధులు వెచ్చిం చి నిర్మిస్తున్న పలు సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. 93 లక్షలు జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించబోతున్న సురక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 12గంటలకు కేజీబీవీ పాఠశాలను జూనియర్ కాలేజీ స్థాయికి అప్‌గ్రేడ్ చేయుటకు 2 కోట్ల 54 లక్షల నిధులతో పలు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 12.30గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సముదాయంలో వ్యవసాయ ఉత్పత్తుల కలెక్షన్స్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్ భవనాలకు 27.50 లక్షలతో శంకుస్థాపన చేస్తారు.

## ఆత్మకూరు యువతకు మంత్రి ఆనం వరం
-విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల,
ఆత్మకూరు ఈ విద్యా సంవత్సరం నుండే ప్రారంభం



**నెల్లూరు, జులై 13, ప్రభాతవార్త – వైద్యం** ఆత్మకూరు నియోజక వర్గానికి ప్రభుత్వ సాంకేతిక విద్యను విక్రమ సింహపురి యూని వర్సిటీ మేనేజ్‌మెంట్ ద్వారా అందేలా పునాది వేసిన ఆనం రామనా రాయణరెడ్డి. 2025-26 విద్యా సంవత్సరం నుండే ఇంజనీరింగ్ కళా శాలలో 300 విద్యార్థులతో 5 బీటెక్ కోర్సుల ప్రారంభానికి మంత్రి నారా లోకేష్ ఆమోదం. ఎన్‌డీఏ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల హామీ నెరవేర్చింది. తాత్కాలికంగా నెల్లూరు వీఆర్ – ఐపీఎస్ కళాశాల భవనాల్లో బీటెక్ క్లాసులు 300 మంది విద్యార్థులకు చేరువైన అవకాశం. 2 ఏళ్లలోగా ఆత్మకూరులో స్వంత భవనాలు నిర్మించి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఆత్మకూరుకు తరలింపు. విద్యారంగంలో మంత్రి ఆనం చొరవకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్. ఆత్మకూరు యువతకు తమ సొంత నియోజకవర్గంలోనే గుణాత్మక సాంకేతిక విద్య అందించే మార్గం. ఆనం రామనారాయణరెడ్డి ముందస్తు దృష్టితో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన బాట. పేద, గ్రామీణ యువత ఇంజనీరింగ్ విద్యను అందుకునే అవకాశాన్ని కల్పించిన ఆనం. యువత.. ఉజ్వల భవిత లక్ష్యంగా విద్యారంగంలో అంకితభావంతో మంత్రి ఆనం అడుగులు. విద్యారంగంలో మంత్రి ఆనం తీసుకున్న నిర్ణయాలు తదుపరి తరాలకు ఆదర్శంగా నిలవనున్నారు. ఆత్మకూరు నుంచే టెక్నాలజీ మార్గంలో ఎంతో మంది యువత ముందుకు సాగే రోజు ధరిచేరింది.

## ఉదయగిరి ట్రాన్స్‌ఫారంతో పొంచి ఉన్న ప్రమాదం



ఉదయగిరి, జులై 13, ప్రభాతవార్త ఉదయగిరి బీట్-3 సచివాలయం ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మరం చుట్టూ చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో ఈదురు గాలులకు వైర్లు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగిసిపడుతున్నాయన్నారు. పలుసార్లు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

## నెల్లూరులో చిల్డ్రన్స్ పార్కులో ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- చిల్డ్రన్స్ పార్కు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 25 మొక్కలను నాటిన మంత్రి
- చిల్డ్రన్స్ పార్కు రూపురేఖలు మార్చి బెస్ట్ పార్కుగా చేసి చూపిస్తా
- కేంద్ర ప్రభుత్వం 5 స్వచ్ఛ అవార్డులు ఆంధ్రకు ప్రకటించడం సంతోషంగా ఉంది
- శుభ్రతకు నెల్లూరును రోల్ మోడల్ చేస్తా : మంత్రి నారాయణ




**నెల్లూరు, జులై 13, ప్రభాతవార్త -వైద్యం** చిల్డ్రన్ పార్కు నిర్మించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 25 మొక్కలను మంత్రి నారాయణ నాటారు. అనంతరం జ్యోతి ప్రజ్వల చేసిన సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ప్రారంభించారు. పార్కు ఏర్పాటుకు కృషి చేసిన జేఎస్ రెడ్డి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్కు సిల్వర్ జూబ్లిలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తాను మున్సిపల్ చైర్‌పర్సన్స్‌గా ఉన్న సమయంలో డంపింగ్ యార్డుని తొలగించి కౌన్సిల్‌లో పార్కుకి ఆమోదం తెలిపామని చెప్పారు. జన్మభూమిలో పెట్టి పార్కు అభివీద్ధి రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. సిటీలో 46 పార్కులను అన్ని హంగులతో ఏర్పాటు చేసిన ఘనత నారాయణ సార్‌కే దక్కుతుందన్నారు. నిత్యం అభివృద్ధి గురించి ఆలోచించే మంత్రి చిక్కటం మన అదృష్టం అని తెలిపారు. డి ప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లా డు తూ గతంలో నెల్లూరులో రెండు పార్కుల గురించే అందరికి తెలుసని, ఇప్పుడు నారాయణ సార్ చలువతో 48కి పార్కుల సంఖ్య చేరిందన్నారు. అభివృద్ధి అంటే నారాయణ అంటే అభివృద్ధి అని మరో సారి నిరూపిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరి స్థితి భాగాలేకున్నా అనుభవంతో అనుకున్నది సాధి స్తున్నారని కొనియాడారు. ఊహకుకూబా అందని వి ధంగా వీఆర్‌హైస్కూల్‌ని అద్భుతంగా తీర్చిదిద్దా రని నారాయణ సార్ ఏ పనితీసుకున్నా సంపూర్ణంగా పూర్తిచేస్తారనిచెప్పారు. వీఆర్సీ ఆధునీకరణలో భాగ స్వామి ఆయన మంత్రికుమార్తె పొంగూరు శరణీకి కూడా ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు వా సులం దరూ ఒక సారి వీఆర్సీ ని చూడాలని పిలుపు నిచ్చారు. చెప్పారంటే చేస్తారనేందుకు నారాయణ సార్ ఓ నిదర్శనమన్నారు. అమరావతి నిర్మాణంలో తలమునకలై ఉన్నా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్కుకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అప్పట్లో నెల్లూ రులో గాంధీ పార్క్ ఒక్కటే ఉండేదన్నారు. డంపింగ్ యార్డుని 2000 సంవత్సరంలో చిల్డ్రన్స్ పార్కుగా టీడీపీ ప్రభుత్వం మార్చిందన్నారు. జన్మభూమిలో 70-30 నిష్పత్తి కింద జేఎస్ రెడ్డి పార్కును ఏర్పా టు చేశారన్నారు. ఇప్పుడు చిల్డ్రన్స్ పార్కు ల్యాండ్ మార్కు స్థాయికి ఎదిగిందన్నారు. ఈ పార్కులో 70 మంది పిల్లలు ఒకే సారి ఆడుకొనేలా 28 లక్షలతో ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వర్చుఅ డవలప్‌మెంట్ యజమాని వాయుగుండం వెంకటేశ్వర్లు పార్కు అభివృద్ధికి ముందుకొచ్చారని ఆధునీకరణకు 40 లక్షలు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారన్నారు. పార్కు రూపురేఖలు మార్చేందుకు లియో కన్సల్టెంట్‌ని పిలిపిస్తానని హామీ ఇచ్చారు. పార్కు కమిటీతో సమీక్షించి డిజైన్ రూపొంది స్తామ న్నారు. 46 పార్కులు నెల్లూరు సిటీలో సిద్ధం చేశా మని సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 5 స్వచ్ఛ అవార్డులను ప్రకటించడం ఆనందంగా ఉంద న్నారు. సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డుల కేటగిరి(జ నాభా ప్రాతిపదికన) 10 లక్షల కంటే ఎక్కువ జనా భా కేటగిరిలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వచ్చిందని, 3 లక్షల నుంచి 10 లక్షల లోపు కేటగిరిలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఉందన్నారు. 50 వేల నుంచి 30 లక్షల జనాభా కార్పొరేషన్ ఉందన్నారు. 50 వేల నుంచి 3 లక్షల జనాభా కేటగిరిలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు అవార్డులు ప్రకటించారన్నారు. అదే వఙధంగా మినిస్టీరియల్ అవార్డు(స్పెషల్ కేటగిరి) గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మినిస్టీరియల్ అవార్డు(స్టేట్ లెవల్0 రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చాయని, రాష్ట్రానికి ఐదు అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఏడాదికి మరిన్ని అవార్డులు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. నెల్లూరు సిటీలో స్వీపింగ్ మిషన్‌లతో రోడ్లు శుభ్రం చేస్తున్నామని, 28 స్వీపింగ్ మిషన్స్ కూడా కార్పొరేషన్‌కి కేటాయించామని తెలిపారు. ఎండ్‌టు ఎండ్ రోడ్ల పనులు పూర్తి చేసి మిషన్‌లతో శుభ్రం చేసే కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు శ్రీకాంత్‌రెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, పార్కువాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు రామ్మూర్తి, పెద్ద పంచల ప్రసాద్, ట్రెజరర్ ప్రసాద్ కమిటీ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

## ఒంటరి వ్యక్తులపై దోపిడీకి పాల్పడే ముఠా అరెస్ట్
- ఒక్క రోజులో కేసు చేదించిన వేదయపాలెం పోలీసులు




**నెల్లూరు క్రైమ్, జులై 13, ప్రభాతవార్త:** ఒంటరిగా వెళ్లే వ్యక్తులు లక్ష్యంగా చేసుకుని మారణాయుధాలతో వారిని బెదిరించి దోచుకుంటున్న నలుగురు సభ్యుల ముఠాను వేదయపాలెం పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన సంబంధించిన వివరాలను వేదాపాలెం సిఐ కే శ్రీనివాసరావు వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు స్థానిక తల్పగిరి కాలనీ సమీపంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం నాగేంద్ర అనే వ్యక్తిని ఒంటరిగా ఉండడం గమనించి కొందరు మారణాయుధాలతో అడ్డగించి నగదు కోసం బెదిరించారు. తన వద్ద లేవని చెప్పడంతో అతని ఫోన్ పే ద్వారా రూ. 5వేలు తమ ఫోన్‌కి పంపించుకుని వదిలిపెట్టారు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందుకున్న వేదయపాలెం పోలీసులు నగర డిఎస్పి సింధు ప్రియ పర్యవేక్షణలో వేదయపాలెం సిఐ కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్సై నవీన్ ఇతర సిబ్బందినిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో చంద్రబాబు నగర్ కు వెళ్లే దారిలో ఖాళీ ప్లాట్ల వద్ద నిందితులైన విజయ్ అలియాస్ పుండా, గుర్రం సుధీర్, షేక్ సిరాజ్, పోలీస్ కాలనీ సమీప ప్రాంతానికి చెందిన పోలా అనిల్, దిలీప్ నర్సింగ్ హోమ్ రోడ్డు ప్రాంతానికి చెందిన బెల్లంకొండ సాయికుమార్ లను ఆదివారం అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదు అందుకున్న అత్యంత తక్కువ సమయంలోనే కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ కే. శ్రీనివాసరావు, ఎస్సై నవీన్ ఇతర సిబ్బందిని ఎస్పీ జీ. కృష్ణ కాంత్, డీఎస్పీ సింధుప్రియలు ప్రత్యేకంగా అభినందించారు.

## ఉత్సాహంగా మూడవరోజు రెవెన్యూ క్రీడలు
- పోటీలు ప్రారంభించిన ప్రత్యేక రెవెన్యూ కార్యదర్శి జి. జయలక్ష్మి




**నెల్లూరు కలెక్టరేట్, జులై 13, ప్రభాతవార్త** పదవ రెవిన్యూ క్రీడలను స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో మూడో రోజు ఘనంగా ప్రారంభించిన రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్, ప్రత్యేక రెవెన్యూ కార్యదర్శి జి.జయలక్ష్మి తొలుత జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కలిసి సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో కలెక్టరేట్ టీం డివిజన్ టీమ్ లు మధ్య షటిల్ ఆడి ప్రారంభించారు అదేవిధంగా మహిళా విభాగంలో కలెక్టరేట్ టీం వర్సెస్ నెల్లూరు డివిజన్ టీంల మధ్య వాలీబాల్ ఆటను ప్రారంభించారు. అనంతరం మహిళా విభాగం 35 సంవత్సరం లోపు 100 మీటర్ల పరుగు పందెంలో గెలుపొందిన సాహిత్య, అనూష



శాంతి ప్రియలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో కలసి అందచేశారు. అదేవిధముగా 200 మీటర్లలో సాహిత్య, హావీల, శాంతి ప్రియలకు, షార్ట్ ఫుట్‌లో శ్యామలత, అనూష కావ్యశ్రీలకు, డిస్కస్ త్రో విభాగంలో సాయి శరణ్య, సుష్మితా వదనలకు, జావాలిన్ త్రో విభాగంలో శాంతి ప్రియ, సాయి శరణ్య, సుస్మిత వదనలకు, లాంగ్ జంప్ విభాగంలో సాయి శరణ్య, సాహిత్య, ఝాన్సీ లకు,హై జంప్ విభాగంలో సాయి శరణ్య, శాంతి ప్రియ, హావీలకు మొదటి, ద్వితీయ,తృతీయ పధకాలను అందచేశారు. అదే విధముగా 400 మీటర్ల రిలే పరుగులో నెల్లూరు, కందుకూరు తదితర టీములకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జల రెవెన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్, రెవెన్యూ డివిజన్ అధికారులు అనూష, అవని, వంశీకృష్ణ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు ఎ ఎం పెంచల రెడ్డి, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ కాలువలు ఇలా.. నీరు పారేది ఎలా ?



**కోవూరు జులై 13 ప్రభాతవార్త :** ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని పలు ఇరిగేషన్ కాలువలు గుర్రపుడెక్కలతో పాటు కాలువలు పూర్తిగా ఆక్రమణలకు గురై చెత్తాచెదారాలతో పూర్తిగా నిండిపోయి ఉన్నాయి. ఫలితంగా ఈ కాలువల గుండా నీరు ప్రవహించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో మురుగునీరు సైతం కాలువ గుండా పారక ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోవూరుకు సంబంధించి దుంపల కాలువకు చీలికాలువ ఇటీవల కాలంలో పూర్తిగా ఆక్రమణలకు గురి కావడంతో ఆ కాలువ అంతా చెత్తాచెదారాలతో డంపింగ్ యార్డ్‌గా నిండిపోయింది. దీంతో ఈ చీలి కాలువ ద్వారా నీరు ప్రవహించలేక ఎక్క డి నీరు అక్కడ ఆగిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రస్తుతం అంటురోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ప థకం ద్వారా ఈ కాలువకు పూడిక తీసి మరమ్మతులు చేసేలా సంబంధిత అధి కారులు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ కాలువ చెత్తా చెదారాలు వేసే డంపింగ్ యార్డ్‌గా పూర్తిగా మారిపోయింది. దీంతో ఈ రహ దారి గుండా ప్రయాణించాలంటే నడక దారిన వెళ్లేవారు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో సంబంధిత ఇరిగేషన్ అధికారులు కానీ, పంచాయతీ అధికారులు గానీ స్పందించి ఈ మురుగు నీరు కాలువ గుండా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.



## నారాయణ నిగర్వి, గొడవలకు అస్సలు పోరు

- మంత్రి నారాయణ గురువులు కితాబ్
- వీఆర్సీలో జరిగిన పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయుల సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి విద్యాబుద్ధులు నేర్పిన లెక్కలు మాస్టర్ నరసింహారెడ్డి సైన్స్ మాస్టర్ చంద్రశేఖర్లను ఘనంగా సన్మానించిన మంత్రి
- బాల్య స్నేహితులతో అలనాటి స్మృతులను గుర్తు చేసుకున్న మంత్రి నారాయణ
- వీఆర్సీని అద్భుతంగా తీర్చిదిద్దిన మంత్రి నారాయణను అభినందించిన గురువులు, పూర్వ విద్యార్థులు
- మంత్రి నారాయణ క్రమశిక్షణకు మారుపేరు పూర్వ విద్యార్థులు వెల్లడి



**నెల్లూరు, జులై 13, ప్రభాతవార్త-వైద్యం** చిన్నతనం నుంచి పొంగూరు నారాయణ క్రమశిక్షణగా ఉన్నారు. కాబట్టి ఈ స్థాయికి వచ్చారని ఆయన చిన్నప్పటి గురువులు కితాబు ఇచ్చారు. గొడవలకు పోకుండా నిరంతరం కష్టపడి చదివే వారిని, నిరాడం బరంగా నిగర్విగా ఉండేవారని వారు వ్యాఖ్యానించారు. వీఆర్సీలో జరిగిన పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులస మ్మేళనంలో మంత్రి పాల్గొన్నారు. తనకు విద్యాబుద్దులు నేర్పిన లెక్కలు మాస్టర్ నరసింహారెడ్డి సైన్స్ మాస్టర్ చంద్రశేఖర్లను మంత్రి పొంగూరు నారాయణ ఘనంగా సన్మానించారు. అనంతరం బాల్య స్నేహితులతో అలనాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్సీలోనే డిజిటల్ క్లాస్ రూమ్‌లో వసతులను చూసినా అపూర్వ విద్యార్థులు గురువులు ఆశ్చర్యానికి లోనయ్యారు. వీఆర్సీ హైస్కూల్ ఈస్థాయిలో అభివృద్ది చెందుతుంది తాము ఎప్పుడూ ఊహించలేదని వెల్లడించారు. వీఆర్సీని అద్భుతంగా తీర్చిదిద్దిన మంత్రి పొంగూరు నారాయణను గురువులు, పూర్వ విద్యార్థులు అభినందించారు. పేద విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్తు కోసం మంత్రి నారాయణ చేసిన హాసంకల్పాన్ని బాల్య మిత్రులు కొనియాడారు. మంత్రితో కలిసి క్రీడా మైదానంలో కలియతిరిగారు. ఈ సందర్భంలో లెక్కలు మాస్టారు నరసింహారెడ్డి మాట్లాడుతూ తను వీఆర్సీలో 37 ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా పని చేశానని మంత్రి నారాయణ క్రమశిక్షణకు మారుపేరని లెక్కలో దిట్ట అని గుర్తు చేసుకున్నారు. గోల్డ్ మెడల్ సాధించిన సమయంలో మంత్రి అయిన సమయంలో నారాయణ ఒకేలా ఉఆన్నరని, ఆయనలో ఎలాంటి గర్వం లేదని చెప్పుకొచ్చారు. ఎంత ఎత్తు కలిగిన గురువులను మర్చిపోని మంచి విద్యార్థి పొంగూరు నారాయణ అంటూ కొనియాడారు. అనంతరం మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ జీవితంలో వచ్చే ప్రతి చీకటిలో వెలుగులు నింపేది గురువులేనని ఆయన అన్నారు. నా కలలకి ఉపాధ్యాయులే రూపశిల్పులని ఉద్వేగ భరితంగా మాట్లాడారు. తరగ తి గదిలో తల రాతలు మార్చే గురు వులకు జీవితాంతం రుణపడి ఉంటాన నాన్నరు. తాను ఈ స్థాయిలో ఉండ దానికి కారణం ఉపాధ్యాయులేనని చె ప్పారు. పూర్వ విద్యార్థులు గురువు లను కలవడం సంతోషంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ బాల్య స్నేహితులు పాల్గొన్నారు.



## ప్రమాణాలు పాటించని హోటల్లపై కఠిన చర్యలు తప్పవు
- ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య



**నెల్లూరు కార్పొరేషన్ జులై 13 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని రెస్టారెంట్లు, హోటళ్లలో కార్పొరేషన్ నిర్దేశించిన ప్రజారోగ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య హెచ్చరించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఒక హోటల్‌ను డాక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్ల ట్రేడ్ లైసెన్స్, ఎన్.ఓ.సి సర్టిఫికెట్ లు తనిఖీ చేశారు. వంటశాలల్లో నిర్వ హణ తీరును పరిశీలించి నిర్వాహకులను వివరణ కోరారు. చెఫ్ ల వ్యక్తిగత పరిశుభ్రత మెరుగుపరచాలని వారి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని ఆదేశించారు. నిర్దేశించిన స్థాయిలో హోటళ్లలో ప్రమాణాలు మెరుగుపరుచుకునేలా హోటళ్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా అన్ని వ్యాపార వాణిజ్య కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణ, నిర్దేశించిన ప్రమాణాల తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో మాగుంట లేఔట్ ప్రాంతంలోని ఒక హోటల్ ను తనిఖీ చేసి ప్రమాణాలు మెరుగుపరుచుకోవాలని నోటీసులు జారీ చేశామని, అనంతరం జరిపిన తనిఖీలలో హోటల్ వారు మెరుగైన ప్రమాణాలను ఆచరిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై ప్రజలంతా పూర్తిగా అవగాహన పెంచుకుని, క్రయ విక్రయాల సమయంలో సాధారణ సంచులను మాత్రమే వినియోగించాలని డాక్టర్ చైతన్య కోరారు. నగర వ్యాప్తంగా ఉన్న అన్ని రెస్టారెంట్లు, హోటల్లు, క్యాటరింగ్ సంస్థల ప్రాంగణాలు, చిన్నస్థాయి ఆహార తయారీ విక్రయ కేంద్రాలలో ఆహార భద్రత సంస్థ నిర్దేశించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, త్వరలో నెల్లూరు నగరపాలక సంస్థ ఆహార ప్రమాణాల భద్రతాసంస్థలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించనున్నామని డాక్టర్ చైతన్య తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాకాణికి ముగిసిన పోలీస్ కస్టడీ

**నెల్లూరు క్రైమ్, జులై 13, ప్రభాతవార్త :** వరుస పోలీస్ కేసులు, కస్టడీలతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎన్నికల సమయంలో ముత్తుకూరు మండలం పంటపాలెం సమీపంలో మద్యం డంపును పట్టుకున్న కేసులో ముద్దాయిగా ఉన్న కాకాణిని రెండు రోజుల పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. దీంతో శని ఆదివారాలలో ఎక్సైజ్ పోలీసులు కాకాణిని జిల్లా కేంద్ర కారాగారం నుండి కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఆదివారం పోలీస్ శిక్షణా కేంద్రంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస నాయుడు కాకాణిని విచారించారు. అన్ని ప్రశ్నలకు తనకేమీ సంబంధం లేదంటూ మాజీ మంత్రి సమాధానం దాటవేసినట్లు తెలిసింది. పోలీసులు ఆధారాలు చూపించి ప్రశ్నించినప్పటికీ కాకాణి దానికి ఏమీ సంబంధం లేదని చెప్పారు. అనుమతించిన కస్టడీ ముగియడంతో ఎక్సైజ్ పోలీసులు కాకాణిని ఆదివారం సాయంత్రం కేంద్ర కారాగారానికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా పొదలకూరు మండలంలో కూడా ఎన్నికల సమయంలో లభించిన మద్యం డంప్ కేసులో గూడూరు ఎక్సైజ్ పోలీసులు సోమవారం కోర్టులో పిటి వారింటి వేసి కాకాణిని అదుపులోకి తీసుకోనున్నట్లు సమాచారం.

## త్రిపుల్ ఐటికి లుంబిని విద్యార్థులు ఎంపిక




**చేజర్ల జులై 13 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 2024 -25 సంవత్సరాలకు సంబంధించి త్రిపుల్ ఐటి సెకండ్ కౌన్సిలింగ్‌లో చేజర్ల మండలంలోని లుంబిని ప్రవేటు పాఠశాల ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి .రామయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఉడతా అనుషా, వి, చరణ్‌రెడ్డి అనే ఇద్దరు విద్యార్థులు బంగోలు క్యాంపస్‌కి ఎంపికైనట్లు తెలియజేశారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి లుంబిని పాఠశాల నుండి 4 గురు విద్యార్థులు త్రిపుల్ ఐటిలో ఎంపికైనట్లు తెలిపారు. పష్ట కౌన్సిలింగ్‌లో ఇద్దరు, సెకండ్ కౌన్సిలింగ్‌లో ఇద్దరు విద్యార్థులు మొత్తం 4 విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఉత్తమ బోధన చేయడం వల్లనే మా విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులను అభినందించారు

## సమస్యలు తెలియజేయండి పరిష్కరించుకోండి : స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, జులై 13, ప్రభాతవార్త:** సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల ప్రజలు వారి సమస్యలను తెలిపి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు రేషన్ కార్డులు, భూ సమస్యలు ఉంటే స్వచ్ఛందంగా ప్రజా వేదికలో సమస్యలను తెలియపరచండి తదుపరి పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు.

## వ్యవసాయ కార్యాలయంకు మహర్దశ



**విడవలూరు, జులై 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయం కొంతకాలం నుండి సరైన మౌలిక సదుపాయాలు లేక ఉపయోగానికి నోచుకోలేదు. నూతనంగా వచ్చిన మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ శ్రీలక్ష్మి రైతులు, తమ సొంత నిధులతో వ్యవసాయ కార్యాలయం చుట్టూ కట్టుదిడ్డంగా వివిధ రకాల రాళ్లతో పాటు, గేటు ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో కార్యాలయం వెళ్లాలంటే రైతుల ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయం చుట్టూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కటిదిట్టం చేశామని ఆమె తెలియజేశారు.

## ప్రజలు పడే ఇబ్బందులు తీర్చండి

**- ఉదయగిరి ఎమ్మెల్యేకు యుడీఎఫ్ డిమాండ్**



**ఉదయగిరి, జులై 13, ప్రభాతవార్త :** జిల్లాలో అత్యంత వెనుకబడి ఉన్న ఉదయగిరి నియోజకవర్గంలో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటికి పరిష్కారం చూపాలని ఉదయగిరి డవలప్‌మెంట్ ఫోరం డిమాండ్ చేసింది. ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ ఆదివారం ఉదయగిరి మండలంలోని గంగిరెడ్డి పల్లికి వచ్చిన సందర్భంగా యూటీఎఫ్ ప్రతినిధులు వి.రామచంద్రమూర్తి, ఎండీ ఖాజ శాసనసభ్యుడుని కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఉదయగిరి నియోజకవర్గంలో రైతులు చిన్ననీటి సాగువనరులపై ఆధారపడి వ్యవసాయం చేసుకొంటున్నారని, వర్షాకాలంలో పడిన ప్రతినీటి బొట్టును వృధా కాకుండా చూడాలని కోరారు. చెరువులను, చెక్ డ్యామ్‌లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. గండిపాలెం, మర్రిపూట్ల, నక్కలగండి రిజర్వాయర్లను ప్రధాన కాలువలను ఆధునీకరించాలని కోరారు. ఉదయగిరి, వింజమూరులోని 30 పడకల ఆసుపత్రులను 100 పడకలుగా పెంచాలని, ఉదయగిరి ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఉదయగిరి, కొండాపురం, తెల్లపాడు, చినక్రాకలలో గల యూనాని, ఆయుర్వేద వైద్యశాలల్లో డాక్టర్లు లేక మూత పడిఉన్నాయని ఆయుష్ శాఖ ద్వారా వాటిని తెరిపించి వైద్యం ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. సాంకేతికపరంగా ఉదయగిరి నియోజకవర్గం వెనుకబడిఉందని పాలిటెక్నిక్ కళాశాలను ఇక్కడ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. గంగిరెడ్డిపల్లిలో మంజూరై ఉన్న మైనార్టీ బాలికల పాలిటెక్నిక్ కళాశాల ఏమైందని వారు ప్రశ్నించారు. ఈ నియోజకవర్గంలో చిన్న పరిశ్రమలు పెట్టే ఔత్సాహికులను ఆహ్వానించి ప్రోత్సహించాలని కోరారు. చరిత్ర ప్రసిద్ధి చెందిన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రదేశంగా గుర్తించేందుకు శ్రద్ధ చూపాలని వారు కోరారు. ఉదయగిరిలో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేసి జిల్లా అధికారులందరిని పిలిచి నియోజకవర్గంలోని ప్రజా సమస్యల సాధనకు కృషి చేయాలని సూచించారు. శాసనసభ్యుని వెంట మాజీ శాసనసభ్యుడు కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ పి.చెంచల్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ఉన్నారు.

## పంచాయతీలో పడకేసిన పారిశుద్ధ్యం

**- కంపుకొడుతున్న డ్రైనేజీలు - పట్టించుకోని గ్రామ పంచాయతీ**
**- తీవ్రతరమవుతున్న దోమల బెడద - అనారోగ్యం పాలవుతున్న ప్రజలు**



**ఉలవపాడు, జులై 13, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉలవపాడు గ్రామ పంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. అడుగడుగునా పారిశుధ్య లోపం కనపడుతుంది. స్పష్టంగా కంపు కొడుతున్న డ్రైనేజీలు దీనికి తోడు విపరీతమైన దోమలతో స్థానిక గ్రామస్తులు అనారోగ్యం పాలవుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉలవపాడు ప్రధాన రహదారి మార్గంలో డ్రైనేజీ మురికి నీరు బయటకు పోయే మార్గం లేక ఖాళీ స్థలంలోనే నిలిచి ఉండడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దుర్వాసనను వెదజల్లుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఇదే పరిస్థితి ప్రధాన రహదారి మార్గంలో డ్రైనేజీలు పూర్తిగా చికెన్ వ్యర్థాలతో నిండుకొని దారుణంగా తయారైంది. బస్టాండ్ సమీపంలో ఫారెస్ట్ ఆఫీసు పక్కన ఇరువైపులా గల డ్రైనేజీ పూర్తిగా మట్టి పూడికతో వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో రహదారిపైకి మురికి నీరు ప్రవహిస్తుంది. ఇకపోతే డ్రైనేజీ పైనే ర్యాంపులు ఏర్పాటు చేయడంతో సమస్య మరింత జటిలంగా మారింది. ఇటీవల ఎమ్మెల్యే ఉలవపాడు పర్యటనకు వచ్చి ప్రజలు చెప్పిన దోమల సమస్యల విషయమై చర్యలు తీసుకుంటామని తెలిపిన ఎలాంటి పరిష్కారం జరగలేదు. ఇది ఇలా ఉంటే ఉలవపాడు ప్రధాన వీధుల్లో భాగమైన అంబేద్కర్ సెంటర్ ఇతర ప్రాంతాల్లో డ్రైనేజీలు ఆక్రమించి కూరగాయాల దుకాణాలు ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలకు వాహనాలకు ఇబ్బందులు



కలుగుతున్న ఏ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఆక్రమణ తొలగించాలని సదరు నోటీసులు ఇచ్చిన తొలగింపు ప్రక్రియ చేపట్టకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఇప్పటికైనా మండల కేంద్రమైన ఉలవపాడులో స్థానిక ప్రజల ఆరోగ్యాలను రక్షించే క్రమంలో డ్రైనేజీల క్లీనింగ్ పారిశుధ్య పనులు దోమల నివారణ చర్యలు ఆక్రమణలు తొలగించే ప్రక్రియ మండల అధికారులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## నేటి నుంచి భాగవతా సప్తాహం



**కోవూరు జులై 13 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సత్యానంద ఆశ్రమంలో శ్రీ బ్రహ్మానంద తీర్థ స్వాముల వారి 8వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి అధ్యక్షతన పురుషోత్తమ స్వామి పర్యవేక్షణలో ఆశ్రమ ఆస్థాన పండితులు సంపూర్ణ వాల్మీకి రామాయణం ఆడియోకర్త అవధాని కోట రాజశేఖర్ ఆధ్వర్యంలో భాగవతా సప్తాహ కార్యక్రమాలను సోమవారం నుంచి 7 రోజుల పాటు నిర్వహిందచం జరుగుతుందని ఆశ్రమ కార్యదర్శి నాగేశ్వరరావు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ 7 రోజుల పాటు ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఈ భాగవతా సప్తాహ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగ ఆయన తెలియజేశారు.

## గ్రామస్థాయిలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యం

**- జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు**



**పొదలకూరు, జులై 13, ప్రభాతవార్త :** సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు మండలం ప్రభరగిరి పట్నంలో బొమ్మి రమణయ్య అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రామ పంచాయ తీలలో గ్రామస్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేసే విధంగా జనసేన పార్టీ గ్రామస్థాయి నాయకత్వాన్ని నిలబెట్టుకునే విధంగా గ్రామాలలో పవన్ కళ్యాణ్ అభిమానులను జనసేన పార్టీ మద్దతుదారులని అందర్నీ కలుపుకొని వారికి సూచనలు సలహాలు ఇస్తూ పార్టీని ఇంకా ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లే విధంగా గ్రామాలలో ప్రజల యొక్క సమస్యలని పరిష్కరిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చేటువంటి సంక్షేమ ఫలాలు వాళ్లకి అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకుంటూ వాళ్లకి సంక్షేమ ఫలాలు అందే విధంగా అడుగులు ముందుకు వేయాలని ప్రతి ఒక్కరు కూడా క్రమశిక్షణగా కూటమి ప్రభుత్వంలో పనిచేస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు, నారదాసు రవి, మధు, మనోజ్ ప్రసాద్, చాట్ల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అంకమ్మ తల్లి గ్రామోత్సవం



**మనుబోలు జులై 13 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన మనుబోలు తూర్పు వీధిలో వెలసివున్న అంకమ్మ తల్లి దేవస్థానం వద్ద శనివారం నాడు ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. మైలు తీర్పు అనంతరం పుట్ట మట్టి తెచ్చి అమ్మవారిని తయారు చేసి పట్టు వస్త్రాలు పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా రజక సంఘం ఆద్వర్యంలో శనివారం రాత్రి అంగరంగ వైభవంగా విద్యుత్ కాంతుల నడుమ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి తప్పెట్లు బాణా సంచాల మోతలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు తమ మొక్కులు తీర్చుకున్నారు.

## మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి మహిళలను కించపరిచేలా మాట్లాడడం సరికాదు



**ఇందుకూరుపేట, జులై 13, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి మహిళలను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదని ఇందుకూరుపేటలోని టీడీపీ మహిళా నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కొత్తూరు సాయిబాబా గుడి వద్ద నుండి మండల కార్యాలయం వరకు నల్లబ్యాడ్జీలతో, ప్లకార్డులతో మహిళా మణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రసన్న కుమార్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్య సమాజంలో మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన ప్రసన్న కుమార్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్త్రీలను నీచంగా మాట్లాడే సంస్కృతి జిల్లాలో ఇప్పటి వరకు లేదని, ప్రసన్న కుమార్‌రెడ్డి మహిళ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ప్రసన్న కుమార్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తుకి పతనం ఆరంభమైందని, నియోజకవర్గంలోని మహిళలంతా నేడు ప్రసన్న కుమార్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రసన్న కుమార్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్‌రెడ్డి, జనసేన నాయకులు గుడి హరికుమార్‌రెడ్డి, చెంచు కిషోర్‌బాబు, దేవి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, దాసరి విజయ్, మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, ముంగర గోపాల్ యాదవ్, మహిళ టీడీపీ నేతలు పుట్ట పద్మ, బద్దిపూడి అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అన్నారెడ్డిపాళెంలో సుపరిపాలనలో తొలి అడుగు



**సంగం జులై 13 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టిడిపినాయకులు మెట్టు విజయకృష్ణారెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకుఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. ఆగష్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా రానుందని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకూమార్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, జులై 13, ప్రభాతవార్త :** మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డితో కలిసి పలు విషయాలు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చర్చించారు. నెల్లూరు కొండయపాలెం గేట్ సెంటర్‌లో వైసిపి రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డితో కలిసి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని వారి నివాసంలో కలిసి పలు విషయాలు చర్చించారు. ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటి దాడికి సంబంధించి, పార్టీ పరంగా ఎలా ముందుకు పోవాలో అన్న విషయం పై నేతలు సమాలోచనలు చేసారు.

## ప్రసన్న ఇంటిపై దాడి ఘటనలో కేసు నమోదు

**నెల్లూరు క్రైమ్, జులై 13, ప్రభాతవార్త :** కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడికి సంబంధించి దర్గా మిట్ట పోలీసులు శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి, ఇంట్లోని వస్తువులన్నింటిని ధ్వంసం చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మందుబాబులుకు అడ్డాగా పోకూరు పశువైద్యశాల

**వలేటివారిపాలెం జులై 13, ప్రభాతవార్త :** మండలంలోని పోకూరు పశువైద్యశాల జాతీయ రహదారి పక్కన బస్టాండు సమీపాన ఉంది. మందుబాబులకు అడ్డాగా నిలిచింది.మద్యం ప్రియులకు ఆలవాల మైంది .వైద్యశాల ఆవరణలో మద్యం సేవిస్తున్నారు. మద్యం మత్తులో వ్యర్థపదార్థాలను వదిలేస్తున్నారు.దీంతో వైద్యశాల ఆవరణంతా మద్యం సీసాలు,గ్లాసులు,ప్లేట్స్ తోనిండిపోతుంది. అపరిశుభ్రతకు నిలయంగా మారింది.దీంతో పశువైద్య సిబ్బందితోపాటు పశుపోషకులుకు అసౌకర్యంగా ఉంది.పట్టించుకోవాల్సిన ఇటు పంచాయతీ అధికారులు గానీ, అటు పశువైద్యాధికారులు గానీ తమకేమిలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.పోకూరు వైద్యశాల గతమెంతో ఘనం.సుదీర్ఘచరిత్ర గలిగింది.మండలాలకు పూర్వమే ఇక్కడ వైద్యశాల ఏర్పాటు చేశారు. పరిసరాల్లోని సుమారు 40కిపైగా గ్రామాల పశువులకు ఎంతో ప్రయోజనకరం గాఉంది.ఇందుకోసం ఆనాటి పెద్దలు సుమారు 5 ఎకరాల దాకా స్థలం కేటాయించారు.చిన్నపాటి వైద్యశాల భవనం నిర్మించారు ఆభవనం పాడైపోయింది.గతంలోనే స్థలము అక్రమణలకు గురైంది.ఉన్నకాడికే ప్రహరిగోడ కట్టారు. ఇటీవల కాలంలో ఏర్పాటుచేసిన అరకొరగా రెండు గదులుతో స్లాబు భవనం ఏర్పాటుచేశారు. అదే దిక్కయింది.అయితే పూర్వీకులు నిర్మించిన భవనం శిధిలమైపోయింది. ప్రహరిగోడ అంతా కునారిల్లుతుంది. పలుచోట్ల గోడకూలిపోయింది.ఆవరణంతా పిచ్చిచెట్లతో అపరిశుభ్రతకు ఆలవాలమైంది.అసాంఘిక కార్యక్రమాలకు నిలయమైంది. పట్టించుకునే నాధుడేలేరు. గతంలో వైద్యశాల భవనాలను పునరి న్నిర్మించాలని ఉన్నతాధి కారులు కుసూచించారు.అయినా ప్రయోజంలేదు.ఉన్నతాధికారులు తగిన చర్యలుతీసుకోవాల్సిందిగా సూచిస్తున్నారు.

## కామాక్షితాయి సేవలో ఎండోమెంట్ సెక్రటరీ



**బుచ్చి జులై 13 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయిని దేవాదాయశాఖ మంత్రి పర్సనల్ సెక్రటరీ కడారి వివేక్ కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆలయ మర్యాదలతో అతిధులకు స్వాగతం పలికారు. అనంతరం అతిధులు ఆలయ ప్రదక్షణ చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకులు వారి గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. శ్రీమల్లికార్జునస్వామి వారికి సహస్రనామార్చన, ఖడ్గమాల పూజ, శ్రీలక్ష్మీగణపతిస్వామి వారికి అష్టోత్తర శతనామార్చన పూజలు నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి అతిధులకు శేష వస్త్రంతో సత్కరించి శ్రీవార్ల చిత్రపటం, తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు వేదాశ్వరచనం అందజేశారు.

## ఆనందోత్సవంతో ముగిసిన రెవిన్యూ, క్రీడోత్సవాలు

**- రెవెన్యూ సిబ్బందిని అందరిని ఒక చోటకు చేర్చి క్రీడలు నిర్వహించడం గొప్ప విషయం**
**- రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు**
**- విజేతలకి బహుమతుల అందించిన జిల్లా కలెక్టర్ ఆనంద్**



**నెల్లూరు కలెక్టరేట్ జులై 13 ప్రభాతవార్త** రెవెన్యూ క్రీడల ద్వారా పోటీతత్వం, ప్రశ్నించే తత్వంతో పాటు సహాయపడే తత్వం అలవరుస్తుందని జిల్లా కలెక్టర్ శ్రీ ఓ .ఆనంద్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో పదవ జిల్లా రెవెన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు 2025 ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడ ల ద్వారా వచ్చిన స్ఫూర్తిని పనులలో చూపించినట్లైతే మంచి ఫలితాలు ఉంటాయని అభిప్రాయ పడ్డారు. రెవిన్యూ సిబ్బంది దైనందిన జీవితంలో పని ఒత్తిడి వల్ల శారీరక రుగ్మతలకు దగ్గరవడం జరుగుతుందని. వాటి నిర్మూలించే విధంగా రోజు కొంత వ్యాయామానికి సమయం కేటాయించాలని అందుకు రెవిన్యూ క్రీడలు ఉపయోగపడతాయి అన్నారు. రెవిన్యూ సిబ్బంది బాగా పనిచేస్తే జిల్లా యంత్రాంగానికి మంచి పేరు వస్తుందని అన్నారు. రెవిన్యూ క్రీడల వల్ల ఒకరితో ఒకరికి పరిచయాలు ఏర్పడి సత్సంబంధాలు మెరుగుపడి ఉదయని తెలిపారు. ఇది ఒక మంచి అవకాశం అని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన రిసర్వే కార్యక్రమాల ద్వారా రాబోయే దయచేసి సంవత్సరాలు ఉంటాయని అన్నారు. ఇన్ని శాఖపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

**- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ** రెవెన్యూ సిబ్బందిని అందరిని ఒక చోటకు చేర్చి క్రీడలు నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు బాగున్నాయని అన్నారు. అడగంగానే జిల్లా కలెక్టర్ రెవిన్యూ క్రీడలకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో రెవెన్యూ క్రీడలను త్వరలోనే నిర్వహించనునట్లు వెల్లడించారు. ప్రతి సంవత్సరం జూన్ 20వ తారీఖున రెవిన్యూ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని దానికి ప్రభుత్వ సహకారం ఉన్నది అని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయినప్పటికీ నేటికి కూడా తెలంగాణలో రెవెన్యూ అధికారులను వారి పాత స్థానాలకు బదిలీ చేయలేదని ఆంధ్రప్రదేశ్లో ఆ కార్యక్రమం వెంటనే చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. రెవెన్యూ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడం గొప్ప విషయం అన్నారు.

**- జిల్లా రెవిన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ** మనిషి పుట్టిన దగ్గరనుంచి గిట్టేదాకా రెవిన్యూ సర్వీసులు ఉంటాయని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తద్వారా మంచి ఫలితాలు రాబట్టవచ్చు అని అభిప్రాయపడ్డారు. క్రీడా స్ఫూర్తితో ప్రజలకు మరింత మమేకమయ్యాల ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారులు పావని, అనూష, వంశీకృష్ణ , జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానంతరం పది క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. క్యాంపు ఫైర్ నిర్వహించి ఆహుతులను అలరించారు. తొలుత గురుకృప కళా క్షేత్రం మరియు దేగా సాంబశివరావు శిష్య బృందం నిర్వహించిన నృత్యాలు అలరించాయి.



## పైపులైన్ పుణ్యమా అంటూ ఓ బాలుడు మృతి

**తోటపల్లిగూడూరు, జులై 13, ప్రభాతవార్త** తోటపల్లిగూడూరు మండలంలోని ముంగలదరువు పంచాయతీ సమీపంలో సర్వేపల్లి కాలువ సమీపంలో ఉన్న ముత్తుకూరు మండలం కృష్ణపట్నం నుంచి గ్యాస్ పైపులైన్ పనులు ప్రారంభించారు. అయితే తోటపల్లిగూడూరు మండలం ముంగలదరువు ప్రాంతంలో పొలాల మధ్యలో నుంచి పైపులైన్‌తో ఉన్నారు. ఈ క్రమంలో పైపులైన్ కోసం సుమారు 12 అడుగులు కాలువ తీసి అందులో ఇనుప పైపులు నిర్మించి ఆ పైపులను వెంటనే పూడ్చి వేయాలి అయితే సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం లేక పర్యవేక్షించి అధికారుల నిర్లక్ష్యం తెలియదు కానీ 9వ తరగతి చదువుతున్న ఓ బాలుడు ఆ కాలువలో పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పుట్లూరు దివాకర్ తోటపల్లిగూడూరు మండలం ముంగలదరువు గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న పుల్లూరు దివాకర్ గ్రామంలోని వినాయకుడి గుడిలో పూజ చేస్తూ చదువుకుంటున్నాడు. అతను ఆదివారం కావడంతో పిల్లలతో కూడా కలిసి ఆ ప్రాంతంలో ఉన్న నేరేడు కాయలు కోసుకునేందుకు అక్కడికి వెళ్ళాడు తీసి పైపులైను వేసి నిర్లక్ష్యంగా వదిలిపెట్టడంతో చుట్టుపక్కల పొలాలలో నుంచి వచ్చిన వాటర్ ఆ కాలువలో నిల్వ ఉండడంతో 12 అడుగుల లోతులో ఉన్న ఆ కాలువ గమనించక ప్రమాదవశాత్తు అదుపు తప్పి ఆ కాలువలో పడ్డాడు. కాలువ పూడిక తీసి ఉండడంతో లోపల బురద పేరుకుపోయి పడిన వెంటనే ఆ బాలుడు ఇనుప పైపుల మధ్యలో చిక్కుకుని మృతి చెందాడు. ఈ విషయమై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బ్రాహ్మణ కులానికి చెందిన పూజారిగా పని చేసుకుంటూ చదువుకుంటున్న ఆ బాలుడుకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

## సుపరిపాలనలో తొలి అడుగుకు విశేష స్పందన



**బుచ్చి జులై 13 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలో 10 వవార్డు 5,6 బూత్‌లు కనిసిరి పాళెం,రాఘవరెడ్డినగర్ కాలనీలలో మాజీ ఎంపిటిసి సభ్యులు చిలకా బాలకుమార్, నాగశాల రాజశేఖర్ నేతృత్వంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచిపెట్టారు. సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సంద ర్భంగా రామానాయుడు మాట్లాడుతు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్మే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నేతృ త్వంలో కోవూరు నియోజకర్గం అభివృద్ధిలో పయనిస్తుందని అన్నారు. అనంతరం ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను శాసనసభ్యురాలి దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు. క్లస్టర్ ఇంచార్జి చిలకా బాలకుమార్‌కి శాలువా కప్పి సన్మానించారు.

## అగ్ని ప్రమాదం బాధితులకు ఎమ్మెల్యే సహాయం



**విడవలూరు, జులై 13, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వరిణి పంచాయతీ గిరిజన కాలనీలో అగ్ని ప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన బాధి తులు అంకులయ్య, సీనమ్మ కుటుంబాలకు స్థానికఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆర్థిక సా యం అందజేశారు. మండల ఇన్చార్జి అడపాల శ్రీధర్ రెడ్డి చేతులు మీదుగా 50 వేలు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ ఛానల్ డి సి చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కుడుములు మల్లికార్జున, మద్దులూరు రాజా, బెల్లంకొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి రూపంలో అంకమ్మ తల్లి



**విడవలూరు, జులై 13, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో వెలసియున్న అంకమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుండి అభిషేకాలు, కుంకుమ అర్చన, రాత్రి పల్లకి సేవ భక్తులచే అత్యంత వైభవంగా అర్చకులు కొర్నాగిరి ఆధ్వర్యంలో చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆలయ సేవకులు వ్యవకరించారు.

## జిల్లా డాన్స్ మాస్టర్ ట్రెజరీగా వెంకీ నియామకం



**కొడవలూరు, జులై 13, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా డాన్స్ మాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ జరిగినవి కొడవలూరు మండల కేంద్రానికి చెందిన సీనియర్ డ్యాన్స్ మాస్టర్ కోవూరు వెంకీ ని జిల్లా ట్రెజరీగా ఆదివారం స్టీరింగ్ కమిటీ పెద్దలు నియమించడం జరిగిందని ఆయన తెలియజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కళా రూపంలో ఉన్న యువతీ, యువకులకు, పెద్దలకు ఖచ్చితమైన ప్రణాళికతో పనిచేస్తానని ప్రమాణం చేసినట్లు ఆయన తెలిపారు.

## మాలకొండ ఉద్యోగులకు జీతాలు నిల్



**వలేటివారిపాలెం జులై 13, ప్రభాతవార్త :** మాలకొండ దేవాలయ ఉద్యోగులకు జూన్ నెల జీతాలు అందలేదు. ప్రతినెలా 1వ తేదీ చెల్లించాల్సిన జీతాలు 13 రోజులు దాటిపోయినా చెల్లించలేదు. దీనితో పలువురు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంలో సంబందిత అధికారుల నిర్లక్ష్యం, అశ్రద్ద కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఆలయంలో ఔట్‌సోర్సింగ్, దినసరి, రెగ్యులర్ తదితర కేటగిరీల్లో పలు హోదాల్లో సుమారు 140మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో సుమారు 100మంది దాకా రోజూవారీ కూలీలుగా నెలకు రూ. 3,500లు చెల్లిస్తున్నారు. ఇంకొందరు రూ. 5వేలు, మరికొందరు రూ. 10వేలు, ఇంకొందరు రూ. 15వేలు చొప్పున పనిచేస్తున్నారు. వీరికి ప్రతినెలా సుమారు రూ. 9లక్షలకి పైగా జీతాలు చెల్లించాల్సి ఉంది. గతంలో ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లించేవారు. ఇటీవల ఆలయ నిర్వహణాధికారి తోపాటు సీనియర్ అసిస్టెంటు వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. వారిస్థానంలో అధికారితోపాటు మరో ముగ్గురు గుమస్తాలు వచ్చి విధుల్లో చేరారు. అయినా జీతాల బిల్లులు వేయడంలో సిబ్బంది వెనుకబడ్డారు. అవగాహనలేకనే ఆలస్యం అయిందని పలువురు ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి ఆలయంలో నిధులు కొరతంటూ ఉండదు. ప్రైవేటు కూలీకు వెళితే వెంటనే కూలీ చెల్లిస్తున్న ఈ రోజుల్లో డబ్బుకు కొదువులేని ఆలయంలో ఉద్యోగులుకు జీతాలు సకాలంలో చెల్లించడంలో అధికారులు విఫలమవడాని న్ని పలువురు విమర్శిస్తున్నారు. నిరుపేదల దినసరి కూలీలమైన తమకు సకాలంలో జీతాలు చెల్లించెందుకు కృషిచేయాలిన పలువురు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు విజ్ఞప్తిచేస్తున్నారు.

## వలేటివారిపాలెంలో యాచకుడు మృతి



**వలేటివారిపాలెం జులై 13, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన వలేటివారిపాలెం బస్టాండు ఆవరణలో ఆదివారం గురునాదం నాగరాజు (30) అనే యాచకుడు అనారోగ్యంతో మృతిచెం దారు. ఉప్పలపాడు సమీపంలోని కస్తూరిబా గాంది విద్యాలయం సమీపాన గల కాలనీలో నివాసం ఉంటున్న మృతుడు బిక్షాటనతో జీవిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడు తున్నట్లు స్దానికులు చెప్పున్నారు. ఈ నేపధ్యంలో ఆయన మృతిచెందారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్సై మరిదినాయుడు తన సిబ్బంది ఏఎస్ఐ బ్రహ్మయ్య, రైటర్ ఏడుకొండలతో సంఘటనాస్దలికి చేరారు. మృతుని వివరాలు సేకరించి దర్యాప్తుచేస్తున్నారు.

## దేవస్థానంకు వితరణ

**బిట్రగుంట జులై 13 ప్రభాతవార్త:** బోగోలు మండలం విశ్వనాధరావు పేట పంచాయతీ రామస్వామిపాలెంలోని శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వర దేవస్థానంనకు ఆదివారం బత్తల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి భార్య బత్తల పద్మావతి కుమారుడు కోడలు బత్తల రాజేష్, బత్తల గౌరీ లు 15 వేల రూపాయల విలువ కలిగిన వైరింగ్ వితరణ గా అందజేయగా, దన్యాసి శివకుమార్ కు వైరింగ్ చేసారని, దేవస్థానమునకు సీలింగ్ ఫ్యాన్ ఎలక్ట్రికల్ షాప్ యజమాని రఘురామిరెడ్డి బహుకరించడం జరిగిందని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తల రవిచంద్ర తెలిపారు. దాతలకు ఈ సందర్బంగా కృతజ్ఞతలు తెలిపారు.

## నటులు కోట శ్రీనివాసరావు మరణం విచారకం



**కావలి రూరల్, జులై13, ప్రభాతవార్త:** వైవిద్యభరితమైన పాత్రలతో సినీ ప్రేక్షకుల అభిమానిన్ని చూరగొన్న ప్రముఖ సీని యర్ నటులు కోటా శ్రీనివాసరావు మరణం విచరకరమని కావలి శాసనస భ్యుడుదగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలియ జేశాడు. ఈసందర్బంగ ఆదివారం ఆయన మాట్లాడారు. షుమారు 4దశాబ్దాలపాటు సిని, నాటకరంగాలకు ఆయన చేసిన కళాసేవ మరువలేనిదని అన్నారు. ఆయన పోషించిన పాత్రలు చిరస్మరణీ యమన్నారు. విలన్‌గ, క్యారక్టర్ ఆర్‌టిస్టిగ ఆయన పోషించిన ఎన్నో మధురమైన పాత్రలు తెలుగు ప్రేక్షకుల మదిలో శాస్వతంగ నిలిచిపోతా యన్నారు. ఆయన మృతి తెలుగు సినీరంగానికి తీరని లోటన్నారు. 1999లో విజయవాడనుంచి ఎంఎల్‌ఎగ గెలిచి ప్రజాసేవ చేశారన్నారు. వారి కుటుంభ సభ్యులకు ప్రఘాడ సానుబూతిని తెలియజేశారు.

## పేద విద్యార్దులకు నోట్ బుక్స్ వితరణ చేసిన ఎన్ఆర్ఐ



**కావలి, రూరల్, జులై13, ప్రభాతవార్త :** కావలి పట్టణ నివాసులు వృత్తి రీత్యా విదేశాలలో వుంటున్న ఎన్ఆ ర్ఐ మోతుకూరు వెంకట అఖిల్, అలేఖ్య దంపతులు మరియు వెంకట అజితలు వారి తాతయ్య, నానమ్మ మోతుకూరు వెంకయ్య, అనుసూయ మ్మల జ్ఞపకార్ధంగ కావలి పట్టణం తుఫాన్ నగర్‌లోని సంయుక్త సేవాస ంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్దులకు నోట్‌బుక్స్, స్టేషనరిఆదివారం వితరణ చేశారు. ఈసందర్బంద మోహన్ పరమేశ్వరి దంపతులు మాట్లాడారు. తమ కుమారుడు, కోడలు, కుమార్తెలు వారి తాతయ్య నానమ్మల జ్ఞాపకార్ధంగ సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్దులకు నోట్‌బుక్స్ ఇవ్వమని తెలియజేశారని అన్నారు. విద్యార్దులను ప్రోత్సహిస్తే ఎంతో శ్రద్దగ చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. విద్యార్దులందరు క్రమశిక్షణతో చదువుకోవాలని మిమ్మల్ని చదివిస్తున్న సంస్థకు తల్లి, దండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. విశ్రాంత అద్యాపకులు ఎమ్‌విఎన్ ప్రసాద్‌రావు మాట్లాడారుసంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్దులకు నోట్‌బుక్స్ వితరణ చేయించిన దాతలకు అభినందనలు తెలిపారు. అనంతరం పోలీస్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులైన మోతుకూరుమోహన్, మార్టూరు పరమేశ్వరి దంపతులను సంయుక్త సేవసంస్థ ఆద్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో మోతుకూరి వెంకటఅఖిల్, తల్లిదండ్రులు మోతుకూరు మోహన్, మార్టూరు పరమోశ్వరి దంపతులు వారి చెల్లిలు మోతుకూరు వెంకటఅజిత, సంస్థ వ్యవస్తాపక అద్యక్షుడు గంగపట్నం సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సంయుక్త నృత్య కాళానిలయం చిన్నారులను అభినందించిన బివి రత్నమ్మ ట్రస్ట్



**కావలి, రూరల్, జులై13, ప్రభాతవార్త:** రెడ్‌క్రాస్ కావలిశాఖ ఆద్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీలలో సంయుక్త నృత్యకాళా నిలయం చిన్నారులు రక్తంయొక్క ఆవశ్యకతపై చేసిన లఘు నాటిక(స్క్రిప్ట్) మొదటి బహుమతిని స్వంతం చేసుకున్న సందర్బంగ ఆదివారం బివి రత్నమ్మ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ ఎంవిఎన్ ప్రసాద్‌రావు క్రిష్టియన్ పేట మొదటిలైన్లోవున్న సంయుక్త నృత్యకళా నిలయంనందు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానిక ముఖ్య అతిదులుగ డాక్టర్ పి శివప్రసాద్, ఎంవిఎన్ ప్రసాద్‌రావులు పోల్గొని మాట్లాడారు. సంయుక్త నృత్యకాళానిలయం చిన్నారులు రక్తం యొక్క ఆవశ్యకతపై చేసిన లఘు నాటిక చూపరులను కంట తడిపెట్టించిందని అన్నారు. రక్తం దొరకని పక్షంలో బాధితులు పడే ఆవేదనను కళ్ళకు కట్టినట్లు చూపించారని కొనియాడారు. ఎంతోగొప్పగ నటించారని శ్లాఘించారు. మొదటి బహుమతి స్వంతం చేసుకొన్న చిన్నారులను అభినందించి సర్టిఫికుట్లు అందించారు. నాట్య గురువు గంగపట్నం లిఖితను ప్రత్యేకంగ అభినంది ంచారు. రాబోవు రోజుల్లో మరెన్నో బహుమతలు అందుకోవాలని తమ యొక్క విద్యార్దులతో మరెన్నో గొప్ప, గొప్ప ప్రదర్శనలు చేయించాలని కావలి పట్టణానికి మరింత పేరు తీసుకురావాలని కోరారు. ఈకార్యక్రమంలో సంస్థ గౌరవ సభ్యులు షేక్ ఖాదర్‌బాష, జి కళ్యాణి, ప్రముఖ వ్యాపారవేత్త పచ్చిపులుసు వెంకన్న, అరవపల్లి నాగరాజు, పి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌ఫర్‌మేషన్ బ్యూరో రాష్ట్ర డైరెక్టర్‌గా టి రత్నాకర్‌ను నియమించడంపై హర్షం



**కావలి, రూరల్, జులై 13, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఫర్‌మేషన్ బ్యూరో డైరెక్టర్‌గ టి రత్నాకర్‌ను నియమించడంపై లోక్‌సత్తా ఉద్యమసంస్థ రాష్ట్ర సమన్వయ కమిది సభ్యుడు ముడిగండ్ల మాలకొండారెడ్డి హర్ష వ్యక్తం చేశాడు. ఈసందర్బంగ ఆదివా రం మాలకొండారెడ్డి మాట్లాడారు. ఇండి యన్ ఇన్‌ఫర్‌మేషన్ సర్వీస్ సీనియర్ అదికారయిన రత్నాకర్ ఇప్పటి వరకు సిబిసిలో ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్‌గ విధులు నిర్వహిస్తు న్నారని తెలిపారు. ఈయన ప్రకాశంజిల్లా కారుమంచి గ్రామంలో జన్మించి ఐఎఎస్ అధికారిగ పనిచేస్తు ప్రస్తుతం ఆద్రప్రదేశ్ ప్రెస్ ఇన్‌ఫర్‌మేషన్ బ్యూరో డైరెక్టర్‌గ భాద్యతలు స్వీకరించిన సందర్బంగ వారికి అభినందనలు తెలిపారు. శ్రేయోభిలాషి ఎం మాలకొండారెడ్డి విజయవాడలో ఆయన నివాసంలో కలసి అభినందనలు తెలియజేశాడు. రత్నాకర్ విద్యార్ది దశనుంచి సామాజిక స్పృహతో కేంద్రప్రభుత్వ సమాచార మంత్రుత్వశాఖలో వివిద హోదాల్లో పనిచేసి సమర్దవంతమైన అదికారిగ పేరుతెచ్చుకున్నారన్నారు.

## మత్య సంపదను మింగేస్తున్నారు



**వరికుంటపాడు, జులై13, ప్రభాతవార్త:** మండలం లోని వివిద గ్రామాల్లో వున్న చెరువుల్లో కొంతమంది అక్రమార్కులు తమ ఇష్టానుసారంగ వ్యవహరిస్తు ఎంతో విలువైన మత్య సంపదను మింగేస్తున్నారు. ప్రతి ఆదివారం అనుమతులు లేకుండానే జాలర్లతో చెరువుల్లో దిగి చేపలను పట్టి ఇతర ప్రాంతాలకు తరలించడంతోపాటు చెరువువద్దే అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు. గత రెండువారాలుగ గువ్వాడి గ్రామంలోని చెరువులో కొంతమంది అక్రమంగ తామే చేపలు పెంచామంటు అమ్ముకుంటున్నారు. నిబంధనల మేరకు గ్రామ పంచాయతి తీర్మానంకాని ఎక్కడాకూడ వారిని చేపలపెంపకం చేపట్టమని అటు అదికారులు కాని, గ్రామ పంచాయతీనందుకాని ఆఖరికి చెరువుకు సంబందించిన పాలకవర్గంకు కాని పెంచుకోమని తెలుపకపోగ వారే ఇష్టానుసారంగ చేపల పెంపకం చేపట్టి అంతకుమించి మత్య సంపదను దోచుకుంటు న్నారు. ఇలా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే గ్రామస్తులపై తిరుగబడు తాన్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ప్రభాతవార్త ఇరిగేషన్ జెయి రమేష్‌ను వివరణ కోరగ చేపలవేట సాగిస్తున్న విషయం తెలియని పరిశీలించి చర్యలు చేపడతామని అన్నారు.

## ఇకనైనా మారండి



**కోవూరు జులై 13 ప్రభాతవార్త :** కోవూరులోని పోలీస్‌స్టేషన్ పరిధిలో కేడీలుగా, అనుమానితులుగా వివిధ కేసుల్లో రౌడీ షీటర్లుగా నమోదైన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని సభ్య సమాజంలో కలిసి పోవాలని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ తెలిపారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా మీరు మారితేనే మీ బతుకులు మెరుగు పడతాయని ఈ సందర్బంగా ఆయన సూచించారు.

## గ్రీవెన్స్‌డేకు అన్ని శాఖల అధికారుల హాజరు తప్పనిసరి



**కోవూరు జులై 13 ప్రభాతవార్త :** కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌డేకు అన్ని శాఖల అధికారులు హాజరైతే వచ్చే అర్జీదారులకు సంబంధించి ఏమైనా తేలికపాటి సమస్యలు ఉంటే వాటిని అక్కడికక్కడే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి మండలంలోని ప్రతి శాఖ అధికారి హాజరు తప్పనిసరి అన్నారు.

## పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు





**వింజమూరు, జులై 13, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలో రానున్న వర్షకాలంను దృష్టిలో ఉంచుకొని పారిశుధ్యం మెరుగుకు కార్యదర్శి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పట్టణంలో అనేక చోట్ల కాలువలు ఊడిపోయి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతున్న నేపథ్యంలో ఇటీవల పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రామారావు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్పంచ్ సహకారంతో పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించారు. అందులో భాగంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో మురుగు కాల్వను పూడిక తీయిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం వింజమూరులోని శాఖ గ్రంధాలయం సమీపంలో ఉన్న పంట కాలువను పంచాయతీ ఆధ్వర్యంలో పూడికతీయించారు. పంచాయతీ ఈవో కే. రామారావు దగ్గరుండి పూడికతీత పనులను పరిశీలించారు. రానున్న కాలంలో వర్షాకాలం అని దృష్టిలో ఉంచుకొని వర్షపు నీరు నివాసాలలోని మురుగునీరు కాలువ గుండా వెళ్లేందుకు వీలుంటుందని ఆయన తెలిపారు. నీరు నిల్వ లేకపోతే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉండేదని అందువల్ల అనారోగ్య పరిస్థితులు ఏర్పడమన్నారు. పంచాయతీ పరిధిలో మురుగు కాలువలను పూడికతీత పనులను చేపట్టే మురుగునీరు నిల్వ లేకుండా వెళ్లేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

## గడపగడపఎక్కుతున్న తెలుగుదేశం శ్రేణులు



**ఆత్మకూరు, జులై 13, ప్రభాత వార్త:** ఆత్మకూరు పట్టణంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం నాయకులు, ప్రజాప్ర తినిధులు ఇంటింటా ముమ్మరంగా పర్యటిస్తున్నారు. రాష్ట్ర దేవాదా యశాఖా మంత్రి ఆనం రామనారా యణరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ టిడిపి అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఆయా ప్రాంతాల తెలుగుదేశం నాయకులు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మెన్, కౌన్సిలర్లు, వార్డు, క్లస్టర్, బూత్‌కమిటీల నాయకులతో కలిసి ఇంటింటా పర్యటిస్తున్నారు. ఈ ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమకార్యక్రమాలు, చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేస్తూ ఆ వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్నారు. ఈసందర్భంగా తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన హామీలమేరకు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, దీర్ఘకాలికవ్యాధిగ్రస్థులకు పెన్షన్ పెంచి ప్రతినెలా 1వతేదీనాడే ఠంఛన్‌గా అందజేస్తున్నామని, మహిళలకు వంటగ్యాస్‌సిలిండర్లు అందజేశామని, తల్లికివందనం పేరుతో ఎందరు విద్యార్థులున్నా వారి తల్లుల ఖాతాలో 15వేలరూపాయలవంతున జమచేశామని, ఈనెలలో రైతులకు అన్నదాతసుఖీభవ పథకం ద్వారా నగదు ఇవ్వనున్నామని, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్‌సదుపాయం కల్పించనున్నామని, ఆడబిడ్డనిధి కూడా ఇచ్చేందుకు సంసిద్ధమవుతున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో రోడ్ల గుంటలు పూడ్చామని, సిమెంటు రోడ్లు వేశామని, అమరావతి రాజధాని నిర్మాణం ప్రారంభించామని పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభించామని తుమ్మల పేర్కొన్నారు. ఏడాదిలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని, రానున్న నాలుగేళ్ళలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, అన్ని హామీలు అమలుచేస్తామని ఆయన తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రాష్ట్రదేవాదాయశాఖా మంత్రి ఆనం రామారాయణరెడ్డి అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారని చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆయనతోపాటు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ సర్దార్, కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, గౌస్‌బాషా, మాదాల శ్రీనివాసులునాయుడు, మహబూబ్‌బాషా, పొడమేకల పెంచలయ్యాయాదవ్, కొప్పోలు రమాదేవి, గందళ్ళ వేణు, పట్టణ టిడిపి ప్రధానకార్యదర్శి తోడేటి వెంకటయ్య, ఆయా వార్డుల టిడిపి నాయకులు తదితరులు పాల్గొంటున్నారు.

## 15న బోగోలుకు మాజీ ఎమ్మెల్యే రాగా

**బిట్రగుంట జులై 13 ప్రభాతవార్త:** బోగోలు వైస్సార్సీపీ కార్యాలయం నందు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం పై మండల స్థాయి విస్తృత సమావేశం ఈ నెల 15 న నిర్వహించడం జరుగుతుందని మండల వైసీపీ కన్వీనర్ ఎం. వీరరఘు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు, కావలి నియోజ కవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరు కానున్నా రని, కావున మండలం లోని అందరు ముఖ్య నాయకులు, సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు, వైస్సార్సీపీ కార్యక ర్తలు విచ్చేసి కార్యక్రమం లో పాల్గొని మన నాయకుల సలహాలు, సూచనలు విని మీ మీ గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపట్టేదానికి కార్యాచరణ రూపొందించాల్సి ఉందన్నారు. కావున పై కార్యక్రమానికి అందరు తప్పక హాజరు కావలసినదిగా కోరారు.

## రైల్వే తెలుగు మీడియం1980 పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**బిట్రగుంట జులై 13 ప్రభాతవార్త:** బిట్రగుంట రైల్వే తెలుగు మీడియం 1980-1981 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బోగోలు మండలం విశ్వనాథ రావుపే టలోని ఎంకే కళ్యాణ మండపం లోఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ కలిగిరమ్మ తల్లికి 16రోజుల పండుగ



**కలిగిరి, జులై13, ప్రభాతవార్త;** కలిగిరి గ్రామ దేవత బక్తుల పాలిట బంగారు తల్లి శ్రీ కలిగిరమ్మ తల్లి 16 రోజుల పండుగ ఆదివారం కలిగిరిలో ఘనంగా నిర్వహి ంచారు. ఉదయంనుండి గుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా కలిగిరి బస్టాండు సెంటర్‌లోని ఆటో యూనియన్ యువకులు పెద్ద ఎత్తున ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. అనంతరం చిన్నారులు కోలా టం, బజన కార్యక్రమం నిర్వహిం చారు. చివరగా ఆల యపెద్దలు , గ్రామ పెద్దల సమక్ష ంలో సుడిమాను దింపుట కార్యక్రమం చేపట్టారు. కలిగిరమ్మ తల్లి తిరు ణాళ్ల సందర్బంగా తిరుణాళ్ల ప్రారంభం రోజున సుడిమాను ప్రతిష్టించి తిరుణాళ్ల జరుపుకు ంటారు. తిరుణాళ్ల చివరి ఘట్టంలో చుడిమానుద్వారా బక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. తిరుణాళ్ల ముగిసిన 16రోజు సుడిమాను దింపేకార్యక్రమం పెద్దల సమక్షంలో చేపడుతారు.

## చికెన్ వేస్ట్ వాహనాలు వస్తే కఠిన చర్యలు తప్పవు



**కోవూరు జులై 13 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్ సర్కిల్ పరిధిలోని కోవూరు, ఇందుకూరుపేట మండలాల్లో చేపలు, రొయ్యలు సాగు చేసే రైతులు ఎవరూ కూడా చికెన్ వేస్ట్‌ను వాడరాదని, అటువంటి వాహనాలు సర్కిల్ పరిధిలో ఎక్కడ వచ్చినా వాటిని సీజ్ చేయడం జరుగుతుందని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని రెండు మండలాల్లో ఎక్కడా కూడా చికెన్ వేస్ట్ వాహనాలు వస్తే వాటిని యుద్దప్రాతిపదికన సీజ్ చేయడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రొయ్యలు, చేపలు సాగు చేసే రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ చికెన్ వేస్ట్ వాహనాల వలన పర్యావరణం పూర్తిగా దెబ్బతినడమే కాకుండా ఈ చేపలు తింటే ప్రజల ఆరోగ్య పరిస్థితి కూడా ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా రైతులు తప్పనిసరిగా చికెన్ వేస్ట్‌ను ఎక్కడా వాడరాదన్నారు. ఇప్పటికే ఈ వాహనాలపై రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామాలకు ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చినా అనుమానంగా తచ్చాడుతున్నా అటువంటి వారి వివరాలను వెంటనే సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు చేరవేయాలన్నారు.

# వైసీపీ నగర కార్యాలయంలో కార్యకర్తల సందడి

- పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి నగర ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- చంద్రశేఖర్ రెడ్డికి తోడుగా నిలిచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తామంటున్న యువత



**నెల్లూరు రూరల్, జులై 13, ప్రభా తవార్త** నెల్లూరు రాంజీ నగర ని యోజకవర్గ ఆఫీసులో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని 4వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జ్ షేక్ సం ధాని భాష కోఆర్డినేటర్ మధు ఆధ్వ ర్యంలో 100 కుటుంబాలు కలిశా యి. ఈ సందర్భంగా డివిజన్ కమిటీల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళలకు, యువతకు. ఇలా పలు వర్గాల ప్రజలకు ఇస్తున్న ప్రాధాన్యతను చూసి డివిజన్ ప్రజలు చంద్రశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వారందరిని ఆప్యాయంగా పలకరించి, పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తుందని జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అండగా చేస్తున్న కార్యక్రమాలే అందుకు నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో జగన్మోహన్ రెడ్డిని మరోసారి ము ఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. ఇటీవల చంద్రశేఖర్ రెడ్డి రెడ్ క్రాస్ నుంచి గోల్డ్ మెడల్ అవార్డు అందుకున్న సందర్భంగా డివిజన్ ఇంచార్జ్ షేక్ అందాన్ని భాష, కోఆర్డినేటర్ మధు, మహిళా నేతలు, యువత కార్యకర్తలు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## అభివృద్ధి పనుల్లో స్థానిక ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

- ఇస్కాన్ సిటీలో 2వ విధీ సి.సి. రోడ్డును ప్రారంభించిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, జులై 13, ప్రభా తవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 20వ డివిజన్ ఇస్కాన్ సిటీ 2వవీధిలో 17లక్షల రూపాయల వ్య యంతో నిర్మించిన సి.సి. రోడ్డును టీడీ పీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధి.కారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 20 వ డివిజన్ అభివృద్ధికి 4 కోట్ల 50 లక్షల రూపాయలు నిధులు కేటాయించాం అని ఆయన తెలిపారు. అభివృద్ధి పనులలో స్థానిక ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి అని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీ.ఎం. కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ , రాష్ట్ర మంత్రి నారాయణ సహకారంతో రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు సాగుతున్నా అన్నారు. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో 4 లక్షల రూపాయల వ్యయంతో ఇస్కాన్ సిటీ 2వ విధీ రోడ్డు బ్యూటిఫికేషన్ పనులు చేసారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రాంతవాసులు ఇస్కాన్ సిటీ 2వ వీధి స్థానికులను ఆదర్శంగా తీసుకోవాలి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ నూకరాజు మదన్ కుమార్ రెడ్డి, కోక్లస్టర్ ఖాదర్ భాషా,స్థానిక కార్పొరేటర్ చేజర్ల మహేష్, నెల్లూరు రూరల్ ఎస్.టి. సెల్ అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనివాసులు, టిడిపి 20వ డివిజన్ అధ్యక్షుడు దారా మల్లి, టిడిపి నాయకులు ఆనంగి రమణయ్య, పోతురాజు రవి, పిచ్చి రెడ్డి, డేవిడ్, శ్రీను,తాళ్లూరు సురేష్, భాస్కర్‌రెడ్డి,నాటకరాణి నవీన్, సాగర్,దయాకర్, విజయ్ కుమార్,మధు, కృష్ణారెడ్డి, కుంభం కృష్ణయ్య, నాదముని, మధు, శ్రీనివాసులు రెడ్డి, రాజా, మధురెడ్డి, రమణారెడ్డి, బాల సిద్ధయ్య, ఎం.సి. సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, కొండయ్య, బొమ్మన శ్రీనివాసులు, చేజర్ల కవిత, శాంతి, పద్మజా యాదవ్, లక్ష్మి యాదవ్, స్థానిక ప్రజలు పార్థసారథి రెడ్డి, వెంకటేశ్వరరావు, టి.కృష్ణారెడ్డి, ఈశ్వర్ నాయుడు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఎమ్మెల్యే పై అనుచిత వాక్యాలు చేయడం సరికాదు : శ్రీధర్ నాయుడు



**విడవలూరు, జులై 13, ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పై ప్రసన్న కుమార్ రెడ్డి అనుచిత వాక్యాలు మాట్లాడడం సరికాదని టిడిపి నాయకులు కొమ్మి శ్రీధర్ నాయుడు పేర్కొన్నారు. మండలం వావిళ్ళ గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ ఎమ్మెల్యేను హేళలం చేసి మాట్లాడడం రాజకీయంలో సరైన విధానం కాదన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఎంతోమంది పేద ప్రజలకు అన్ని విధాలుగా వి పి ఆర్ ఫౌండేషన్, కన్‌స్ట్రక్షన్ ద్వారా ఆదుకోవడం జరుగుతుంది. కొడవలూరు మండలం నుండి వావిళ్ళ వరకు రోడ్డు గుంతల మయంగా ఉండడంతో రోడ్డు ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఇలా ఎన్నో ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల ముందు తీసుకొస్తున్నారు. మండల ఇంచార్జ్ అడపాల శ్రీధర్ రెడ్డి, ఒగు నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు ఏటూరు శ్రీహరి రెడ్డి, దూది విజయ రాఘవన్, మోర్ల శివప్రసాద్ గౌడ్, కొల్లు చిన్న వెంకయ్య, కుడుముల మల్లికార్జున్, దళిత మహిళ నాయకురాలు పల్లం శేషమ్మ, మేకల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న వ్యాఖ్యాలు ఖండిస్తున్నాం



**బుచ్చి జులై 13 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం టిడిపి కార్యాలయంలో టిడిపి ,బిజెపి రూరల్ నాయకులు విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు రఘురామరెడ్డి మాట్లాడుతు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని మహిళ అని కూడా చూడకుండా విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ప్రసన్నకుమార్‌రెడ్డిపైన వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని విమర్శించే స్దాయి ప్రసన్నకుమార్‌రెడ్డికి లేదని అన్నారు. మహిళల తో ఎలా మాట్లాడాలో తెలుసుకోవాలని అన్నారు.వైసిపి నాయకులంతా మహిళలతో ఇదే విదంగా వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. మరోసారి ప్రశాంతమ్మను విమర్శిస్తే ప్రసన్నకుమార్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయాల్సి వస్తుందని అన్నారు. అనంతరం బిజెపి రూరల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి మాట్లాడుతు మహిళలను గౌరవించడం మన సాంప్రదాయం ,అటువంటిది ఎమ్మెల్యే స్దాయిలో ఉన్న ప్రశాంతిరెడ్డిని వినరాని మాటలాతు విమర్శించడం ప్రసన్నకుమార్‌రెడ్డికి మంచి పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. అనంతరం మహేష్‌రెడ్డి మాట్లాడుతు ప్రశాంతిరెడ్డిని అవమానించిన ప్రసన్నకుమార్‌రెడ్డిని పరామర్శించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి రావడం సిగ్గు చేటు అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆయన చేసిన వ్యాఖ్యలను వెనుకకు తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సాల్మాన్‌పురం సశ్మానానికి ఏమి చేశారో గుర్తు చేసుకోవాలని విమర్శించారు. ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యే అయిన వెంటనే సాల్మాన్‌పురం స్మశాన సమస్యను పరిష్కరించారని అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపైన ఇటువంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు కొండారెడ్డి, కూటమి నాయకులు మల్లు పెంచలరెడ్డి, నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, అంకితపల్లి రమేష్‌రెడ్డి, భూమిరెడ్డి, రవిచంద్రారెడ్డి, ఎర్రబల్లి నాగేంద్ర, గంపల నరసయ్య, సన్నపురెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, సన్నపురెడ్డి మహేష్‌రెడ్డి, భూమిరెడ్డి రవి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వైద్యవిధానాల్లో ఆధునిక మార్పులు తప్పని సరి

- డాక్టర్ ఎం.శ్రావణి రెడ్డి




**నెల్లూరు, జులై 13, ప్రభాతవార్త –వైద్యం** వైద్య రంగంలో అందివస్తున్న సాంకేతికతపై అవగాహన పెంచుకుని తదనుగుణంగా ముందుకెళ్తే రోగులకు మెరుగైన చికిత్సను అందించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు దోహద పడుతుందని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎం.శ్రావణిరెడ్డి పేర్కొన్నారు. పల్మనాలజీ విభాగంలో నేడు మారిన సాంకేతిక చికిత్సా పద్ధతులపై ఆమె ఆదివారం నెల్లూరులో ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అప్డేట్ 2025 పేరుతో(సీఎంఈ– కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్) శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ నెల్లూరు జిల్లా పల్మనాలజీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమం మినర్వాగ్రాండ్ హోటల్‌లో జరిగింది. డాక్టర్ ఎం.శ్రావణిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా పల్మనాలజీ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ గౌరీనాధ్, డాక్టర్ పిట్టి మల్లిఖార్జునరావు పాల్గొన్నారు. వారితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 280 మంది వైద్యులు, పీజీ విద్యార్థులు, క్రిటికల్ కేర్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ కూడా భాగస్వామ్యం పంచుకుంది. 2 క్రెడిట్ అవర్స్ మెడికల్ కౌన్సిల్‌కు చెందిన ప్రముఖ శ్వాసకోశ నిపుణులు పాల్గొని బ్రాంకో స్కోపీ, థొరాకోస్కోపి,ఈబీయుఎస్(ఎండోబ్రోన్చియల్ అల్ట్రా సౌండ్), ఎయిర్ వే మేనేజ్ మెంట్ వంటి ఆధునిక శ్వాసకోశ చికిత్సా విధానాలపై వారు చే సిన అధ్యయనాలు, అనుభవాలను పంచుకు న్నా రు. ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అప్డేట్–2025 శిక్ష ణా కార్యక్రమంలో భాగంగా నిర్వహణ కర్త, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎం.శ్రావణి ప్రసంగించారు. ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యవస్థ, ఇతర భా గాల వ్యాధుల నిర్ధారణ, చికిత్స వంటి విధానాల్లో రోజు రోజుకు మారుతున్న ఆధునిక సాంకేతిక వైద్య పద్ధతులపై తాను ప్రతినిత్యం అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. నేటి ఆధునిక వైద్య విధానాల్లో ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. పల్మనాలజీ వైద్యులు నిత్య సాధన చేయాలని, ప్రధానంగా వైద్య రంగంలోవస్తున్న మార్పులపై అవగాహన పెంచు కోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, సాంకేతికతను అందిపుచ్చుకుని చికిత్సా విధానంలో ముందుకెళ్తే రోగికి సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించడలమని డాక్టర్ ఎం.శ్రావణిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అప్డేట్ –2025 శిక్షణా కార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించిన పల్మనాలజీ అసోసియేషన్, ఏపీ మెడికల్ కౌన్సిల్, ఇతర నిపుణులకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో అపోలో హాస్పిటల్ డైరక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ సుజాత, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదర్ వలీ, అపోలో హాస్పిటల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కేఆర్ఆర్ ఉమా మహేష్, యూనిట్ హెడ్ బాలరాజు, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నిలయాలుగా మట్టి తవ్వకాలు





**తోటపల్లిగూడూరు, జులై 13, ప్రభాతవార్త** తోటపల్లిగూడూరు మండలంలోని కోదూరు పంచాయతీలో మహాలక్ష్మీపురం నుంచి కోదూరుకు వెళ్లే మార్గమధ్యలో ఇటీవల గత 15 రోజులుగా మట్టి తవ్వకాలు ప్రారంభించారు. అయితే ఈ మట్టి తవ్వకాలు అక్రమంగా జరుగుతున్నాయా సక్రమంగా జరుగుతున్నాయా అన్న విషయంపై గ్రామాలలో చర్చ అయితే విపరీతంగా ఉంది. గతంలో ఇక్కడే మట్టి అక్రమంగా తరలిస్తున్నారని మైనింగ్ అధికారులు పంచాయతీ అధికారులు కూడా ఈ ప్రాంతానికి వచ్చి సర్వే చేసి మట్టి తోలుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పి వెళ్లినప్పటికి మట్టి తవ్వకాలు మాత్రం సాఫీగానే జరుగుతున్నాయి. అంతా కరెక్ట్‌గానే ఉంది. సక్రమంగానే మట్టి తోలుకుంటున్నారు అనుకుంటే అర్ధరాత్రి పూట జేసీబీలు ట్రాక్టర్లు పెట్టి హడావుడిగా తోలడాన్ని బట్టి పలు అనుమానాలకు తావిస్తోంది. వారు సక్రమంగానే తోలుకుంటున్నారు అనుకుందాం మహాలక్ష్మీపురం నుంచి కోదూరు మీదుగా తోటపల్లిగూడూరుకి వందల వాహనాలు వెళ్తూ వస్తూ ఉంటాయి.ఈ మట్టి తరలిస్తున్న వ్యక్తులు రోడ్డు పక్కన బావిలను తలపించే విధంగా గుంటలు పెట్టి మట్టి తరలిస్తున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే కోదూరు రోడ్డు ఇప్పుడు ఈ మట్టి తరలించడం వల్ల ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. రోడ్డు పక్కన కనీసం 10 మీటర్లు వదిలిపెట్టి సైడు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకొని తరువాత మట్టి తరలించుకుంటే బాగుండేది. కానీ అవేమి పట్టించుకోకుండా రాత్రిపూట మాత్రమే బావిలను తలపించే విధంగా జేసీబీలు ట్రాక్టర్లు పెట్టి మట్టి వేసుకుని వెళ్ళిపోతున్నారు.ముందు రోజు అదే రూట్‌లో తిరిగే వాహనదారులు తెల్లరేసరికి రోడ్డు పక్కన పెద్ద గొయ్యలు ఉండడంతో ఆశ్చర్యానికి గురవుతున్నారు. అధికాక ముందు రోజు బాగుంది కదా అని అదే రూట్లో వెళ్లేవారు అదుపు తప్పి ఆ గుంట్లో పడి ప్రమాదాలు భారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇటీవల కాలంలో ఇద్దరు యువకులు బైక్ పై వెళ్తూ ఇదే ప్రాంతాలో పడి ఇప్పటికి చికిత్స పొందుతున్నారు. మట్టి తరలించే వారు వాళ్ళు సొంత మట్టే అనుకుందాం అయితే రోడ్డు పక్కన కనీసం మూడు మీటర్లు కూడా గ్యాప్ లేకుండా గోతులను తలపించే విధంగా మట్టి ఎత్తు ఉంటే రేపు రాబోయే రోజుల్లో వర్షాలు కురిస్తే రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉండదా అని ప్రజలు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. ఇదే దారిలో ప్రతినిత్యం సచివాలయ సిబ్బంది దగ్గర నుండి పంచాయతీ సెక్రటరీలు మండల కార్యాలయానికి వెళ్లే అధికారులు అందరూ ఈ దారిలోనే తిరుగుతూ ఉంటారు. రాజకీయ నాయకులు అయితే ప్రతి రోజు ఇదే దారిన వెళ్తూ వస్తూ ఉంటారు. రోడ్డు పక్కన ఇంత లోతులో గుంతలు ఉంటే ఎవరికి కనపించకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఇలా రోడ్డు పక్కన ఆరు మీటర్లు 7 మీటర్లు లోతు గుంతలు పెట్టి మట్టి తరలిస్తూ ఉంటే ఇది అధికారుల అలసత్వమా పాలకుల నిర్లక్ష్యమా అని ప్రజలు గట్టిగానే విమర్శిస్తున్నారు. మట్టి ఎత్తుకుంటే ఎత్తుకున్నారు. కానీ రోడ్డు సైడు కనీసం 10 మీటర్లు వదిలిపెట్టి మట్టి ఎత్తుకోవాలి అందులో కూడా రోడ్డు సైడు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టి తరువాత వాళ్లు మట్టి తోలుకోవడంలో తప్పులేదు అవేమి లేకుండా ఇష్టానుసారంగా రోడ్డు సైడు ఆరు ఏడు మీటర్ల లోతు గుంటలు పెట్టేసి ఆ దారిలో వెళ్లే వారు ప్రమాదాల భారిన పడరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టితో ఒకరు జరిపిన ప్రాంతంలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## అక్రమంగ గ్రావెల్ తరలింపు

జేబులు నింపుకుంటున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారులు





వరికుంటపాడు, జులై13, ప్రభాతవార్తః భూతల్లిని అమ్ముకుంటు తమ జేబులు నింపుకోవడమే కాకుండ అదికారులను సైతం రాజకీయ పలుకుబడులతో ప్రక్కదోవ పట్టిస్లు రియల్ వ్యాపారులు యదేశ్చగ గ్రావెల్‌ను తరలించుతున్నారు.ఆదివారం మండలంలోని జి కొత్తపల్లి గ్రామ సివారులోని ఇరిగేషన్ చెరువులో వ్యాపారులు జెసిబి ద్వార తవ్వకాలు చేపట్టి ఏడు ట్రాక్టర్‌లతో మట్టిని తరలించడం చర్యనియాంశంగ మారింది.అటు అదికారుల అండదండలు లేకపోతే సామాన్యులు ఒక ట్రప్పుకూడ తోలుకోలేని స్థితి లేకపోగ రియల్ వ్యాపారులకు మాత్రం వందల సంఖ్యలోట్రిప్పులు మట్టిని తోలుకునేందుకు అదికారులు సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అధికారపార్టి నాయకుల అండదండలతో దందా సాగిస్తు నిరంతరాయంగ గ్రావెల్ తరలింపును కొనసాగిస్తున్నారు.దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతోపాటు భారి త్రవ్వకాలవలన గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగ మారే అవకాశాలు వున్నాయి.కావున సంబందిత ఉన్నతాదికారులు ప్రత్యేక చొరవచూపి నిభందనలను మరిచి సాగిస్తున్న గ్రావెల్ త్రవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుచున్నారు.

## ఉజ్జయిని మాత విగ్రహం ఏర్పాటు .. ప్రత్యేక పూజలు



**కోవూరు జులై 13 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో ఆషాడ మాస ఆదివారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఉజ్జయిని నుంచి తెచ్చిన అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు శేఖర్ స్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాత:కాలమునే వీరభద్ర స్వా మివారికి అభిషేక పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉజ్జయిని మాత విగ్రహాన్ని కోవూ రుకు చెందిన కె. హజరత్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా దేవస్థానానికి అంద జేశారు. ఈ సందర్భంగా దాతల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేక పూజలను త్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అధిష్టానం మాటే శిరోధార్యం : ఎమ్మెల్యే




**వింజమూరు, జులై 13, ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ అధిష్టానం మాటే శిరోధార్యంగా ప్రతి ఒక్కరం పార్టీ కోసం పని చేయాలని, ప్రజలకు సేవ చేసేందుకు పదవులు ముఖ్యం కాదని, పార్టీలో కష్టపడితే పద వులు వాటి అంతట అవే వస్తాయని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం వింజ మూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ, మండల పార్టీ కమిటీ ఎన్నిక నియోజకవర్గ పరిశీలకులు వల్లభనేని సుబ్బారావు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వికాస్ హరికృష్ణ, ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా అతిధులను శాలువాలతో ఘనంగా సన్మానించి, పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ఎన్నికలను ఎదుర్కొ నేందుకు ప్రతి కార్యకర్త నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్ర మంలో 175 నియోజకవర్గాలలో 12వ స్థానంలో ఉన్నామని దీనిని పది రోజుల లోపల 70 శాతానికి తీసు కెళ్లడమే లక్ష్యంగా ఎనిమిది మండలాల మండల నాయకత్వం పని చేయాలని తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా పార్టీలో కష్టపడిన వారికి పదవులు దక్కాలన్న ఉద్దేశంతో నియోజకవర్గంలో సుమారు 90 పంచాయతీలలో తిరిగి గ్రామ కమిటీలను ఎన్నిక చేయడం జరిగిందన్నారు. పదవులు లేవని అధైర్యం పడ వద్దని, తెలుగుదేశం కార్యకర్త గొప్పపదవి అని తెలిపారు. పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు మంత్రి నారా లోకేష్‌బాబు, మహానాడులో ఏమి చెప్పారో ఒక సారి గుర్తు చేసుకోవాలని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్త పట్టుకొమ్మలాంటి వారని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదని ఆదేశాలు ఉన్నట్లు తెలిపారు. తెలుగుదేశం కార్యకర్త నుండి బూత్ ఇన్‌ఛార్జ్, బూత్ ఏజెంట్, నాయకులు, నేతల కష్టంతోనే ఈ రోజు నాకు ఎమ్మెల్యే దపవి వరించిందని తెలిపారు. వైసీపీ వికృత చేష్టలు బూత్ పురాణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, దంపతులను పై మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమా ర్‌రెడ్డి, అనుచిత వ్యాఖ్యలు చేశారని, అలాంటి వారిని క్షమించరాదన్నారు. వేమిరెడ్డి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. అనంతరం పరిశీలకులు వల్లభనేని సుబ్బారావుకు గ్రామ, మండల కమిటీల ఎన్నిక చేయబడిన పేర్ల నివేదికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర ఉపాధ్యక్షులు కంభం విజయరామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చంచలబాబు యాదవ్, రాష్ట్ర కార్య దర్శులు మన్నేటి వెంకట రెడ్డి, ఎల్‌సీ రమణారెడ్డి, మండలాల పరిశీలకులు కాకి ప్రసాద్‌రావు, బాణా శ్రీనివా సులురెడ్డి, బీద గిరిధర్‌రెడ్డి, దొడ్డపనేని రాజా నాయుడు, పుట్టం బ్రహ్మానందరెడ్డి, ఆర్ వీరేంద్ర చౌదరి, మన్నవ రవిచంద్రరావు, రైతు అధ్యక్షులు బొల్లినేని వెంకట రామారావు, మండల కన్వీనర్లు సీహెచ్ బయ న్న, మధు మోహన్‌రెడ్డి, గొంగటి రఘునాథరెడ్డి, గూడా నరసారెడ్డి, చల్లా శ్రీనివాస యాదవ్, చంద్ర జూ పల్లి చేబ్రోలు మంచాల శ్రీనివాస్ నాయుడు, మధుసూదన్‌రావు, గణపం సుదర్శన్‌రెడ్డి, గంజాం రాఘు వేంద్ర, ఇతర ముఖ్య నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జీలు తదితరులు ఉన్నారు.

## సభ్య సమాజం తలదించుకునేలా మాజీఎమ్మెల్యే ప్రసన్న వ్యాఖ్యలు

-ఎమ్మెల్యే వేమిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసన్నపై కఠినచర్యలు తీసుకోవాలి
-ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి జనసేనపార్టీ సంపూర్ణ మద్దతు
-జనసేన వీరమహిళానేత గునుకుల విజయలక్ష్మీ వెల్లడి



**నెల్లూరు, జులై13 ప్రభాతవార్త–విద్య** సభ్యసమాజం తలదించుకునే విధంగా మహిళా ఎమ్మెల్యేని కించప రుస్తూ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వాఖ్యలను తాము తమ పార్టీతరపున తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ సతీమణి, పార్టీ వీరమహిళానేత గునుకుల విజలయక్ష్మీ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని స్దానిక గోమతినగర్‌లోని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వ్యక్తి గత జీవితాన్ని వక్రీకరిస్తూ, మహిళాలోకాన్ని కించపరిచేలా ప్రసన్న కుమార్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా పనిచేసి, రాజకీయ నేదప్యం నుండి వచ్చామని బాకాలు ఊదుకునే నల్లపురెడ్డి ఓడిపోయాడన్న అక్కస్సు తో ఇలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. దీనిని ప్రభుత్వం సీనియర్‌గా తీసుకుని ఇలా ఏ ఇతర మహిళల గురించి వేరే వారు మాట్లాడకుండా ఉండేలా కఠిన చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారాన్ని లేపాయని, జిల్లా పరువును ఆయన బుగ్గిపాలు చేశారన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వారి వారి నివాసాల్లోని మహిళలు, అక్కలు, చెల్లెల్లు, అమ్మలకు చూపిస్తే వారు కూడా ప్రసన్ననే చెప్పుతో కొట్టేవారని యావత్ మహిళా లోకాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసిన అతనిని కఠినంగా శిక్షించాలన్నారు. ఉన్నత ఆశయాలతో తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పార్టీని స్థాపించి మహిళలను రాజకీయాల్లోకి రాణించేలా చేస్తున్నారని, అలాగే కూటమి ప్రభుత్వం మహిళలల అభివృద్ధికి పెద్ద పీటవేస్తుంటే ప్రసన్నలాంచి నేతలు నీతిమాలిన రాజకీయాలు చేస్తూ మహిళలను తలదించుకునే పరిస్దితికి తీసుకువస్తున్నారన్నారు. మహిళలను కించపరిచి ఏ వ్యక్తి బాగుపడలేదని గుర్తుచేశారు. ఏది ఏమైనా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి తమ పూర్తి మద్దతు ఉంటుందని , మహిళలు అందరూ ఆమే వైపే ఉన్నామన్నారు.ఇటువంటి నీతి మాలిన వ్యక్తులు మాట్లాటే మాటలను పట్టించుకోవాల్సిన అవసనం లేదన్నారు. అనంతరం మేమందరం ఎమ్మెల్యే వేమిరెడ్డికి మద్దతు అనే పోస్టర్స్‌ను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో మహిళానేతలు కృష్ణవేణి, రామాల జయలక్ష్మీ, కాపులూరు సునీత, పసుపులేటి ప్రవల్లిక, ప్రశాంతి, శిల్ప, ఉమ, మడపర్తి లక్ష్మీ, పార్టీ జిల్లా ప్రదాన కార్యదర్శి గనుకుల కిషోర్, రూరల్ నేత పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి సేవలో భూపరిపాలన ముఖ్యకార్యదర్శి విజయలక్ష్మీ ఐఏఎస్



**నెల్లూరు, జులై13 ప్రభాత వార్త–విద్య** నగరం లోని స్థానిక దర్గామిట్టలో వెల సియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని ఆదివారం ఉదయం ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కార్యదర్శి జి.విజయలక్ష్మీ ఐఏఎస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆమెకు ఆలయ కార్యనిర్వహణ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి,అర్చక స్వాములు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం శ్రీ సుందరేశ్వరస్వామిని దర్శించుకుని ఖడ్గమాల పూజను గావించారు. అర్చక స్వాములు వేద మంత్రాలతో ఆశీర్వదించి శేషవస్త్రలు, తీర్ధ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీఓ అనూష, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.